క్లుప్తంగా

మహిళల చేతిలో మొక్కల సంరక్షణ



ఉమెన్ ఫర్ ట్రీ కార్యక్రమం చేపడుతున్న మున్సిపల్ కమిషనర్ చింతల వేణు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం నల్లకుంట చెరువు కట్ట పక్కన అమృత్ 2.0లో భాగంగా ఉమెన్ ఫర్ ట్రీ కార్యక్రమంలో వైరా పురపాలక సంఘం, డ్వాక్రా మహిళ సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చింతల వేణు మాట్లాడారు. మహిళల చేతిలో మొక్కల సంరక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీమాన్య, మెప్మా డీఎంసీ సుజాత, మెప్మా టీఎంసీ బండారుపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టీకాలు తప్పని సరి

సత్తుపల్లిటౌన్: చిన్నారులకు ఏడురకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని గంగారం పీహెచ్‌సీ వైద్యుడు అవినాష్ అన్నారు. శనివారం మండలంలోని పలు ఆరోగ్య ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో.. 0–5 సంవత్సరాలలోపు పిల్లలకు ఇంజక్షన్లు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శారారాణి, ఏఎస్‌ఎంలు మంజుల, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేపడితే చర్యలు

ముదిగొండ: ఇసుక కూపన్లు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దమండవలోని మున్నేరు ప్రాంతంలోని ఇసుక రీచ్‌ను పరిశీలించారు. కూపన్లు లేకుండా మున్నేరులో ఇసుక నింపిన ట్రాక్టర్‌లను గుర్తించి ఇసుకను అక్కడే కార్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామంలోని శ్రీబాలాజీ వృద్ధాశ్రమంలో శనివారం స్థానిక పల్లె దవాఖానా వైద్యులు వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించి పలు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది కుమారి, సాయిరెడ్డి, అరుణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసు నమోదు

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామానికి చెందిన మందా నారాయణపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 20న గ్రామానికి చెందిన మందా యాదగిరి తన వ్యవసాయ పొలంలోని రాళ్లను జేసీబీ సాయంతో తొలగిస్తున్నాడు. దీంతో నారాయణ నాభూమిలో రాళ్లను తొలగిస్తున్నావేంటని యాదగిరిపై దాడికి పాల్పడి చంపుతానని బెదిరించాడు. ఈ ఘటనలో యాదగిరికి ఎడమ చేతికి గాయాలైనాయి. బాధితుడు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

సరువులు ఊరేగింపు

సత్తుపల్లి: సత్తుపల్లిలోని గుడిపాడు కాలనీలో నాయకపోడు గిరిజనుల ఆరాధ్యదైవం పెద్దమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా శనివారం రాత్రి స్థానిక కృష్ణమందిరం నుంచి ఆలయం వరకు సరువులను ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో రవి, భాస్కర్‌రావు, విజయ్, సూరిబాబు, నర్సింహారావు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శివలింగ ప్రతిష్ఠా మహోత్సవం

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో పురాతన కాలంలో శ్రీ పురమ్మతల్లి, శివలింగ ప్రతిష్ఠా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహావచనం, వాస్తు పూజ, హోమం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ, దేవదర్శన్ నిర్వహించారు. ఎపురమ్మతల్లి శాంతి కల్యాణం జరిపించారు. సత్తుపల్లి పట్టణ వాస్తవ్యులు బ్రహ్మశ్రీ రామబాగా గురుబ్రహ్మాచార్యులు శిష్యబృందంచే పూజా కార్యక్రమాలు, క్రతువు నిర్వహించారు. అనంతరం మూడువేల మందికి అన్నదానం నిర్వహించారు.

ఘనంగా త్రిరాత్రి ఉత్సవాలు

సత్తుపల్లిటౌన్: అయ్యగారిపేట శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంలో శ్రీహనుమంత్ జయంతి త్రిరాత్రి మహోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారిని గంధ సింధూరం, తమలపాకులతో సహస్రనామార్చనలతో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు కృష్ణయ్య, మాధవరావు, ప్రసాద్, కృష్ణారావు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

ముదిగొండ: మండలపరిధిలోని పెద్దమండవలో చల్లా నాగేశ్వరరావు సేంద్రియపద్ధతుల్లో సాగుచేస్తున్న వరి, పప్పుధాన్యాలు, నూనె గింజల సాగును మధిర ఏడీఏ విజయచంద్ర, ఏఓ సరిత శనివారం పరిశీలించారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేపడుతున్న రైతును ఏడీఏ అభినందించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కళాకారులకు నిలయం.. ముగ్గు వెంకటాపురం

- ప్రాచీన కళకు ప్రాణం పోస్తున్న శిల్పులు
- ఆలయాల నిర్మాణం.. విగ్రహాల తయారీకి పెట్టింది పేరు..

కల్లూరురూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏ ఊర్లో లేని శిల్పకళాకారులు కల్లూరు మండలం ముగ్గు వెంకటాపురంలో గల చైతన్యనగర్‌లో కొలువుదీరారు. ఇక్కడి కళాకారులు రకరకాల విగ్రహాల తయారీతో పాటు ఆలయ నిర్మాణంలో నిష్ణాతులు. ఉపాధి కోసం నేర్చుకున్న ఈ విద్య ప్రస్తుతం అనేక కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటోంది. ముగ్గు వెంకటాపురంలోని చైతన్యనగర్‌లో నివాసం ఉంటున్న శిల్ప కళాకారులు ఈ ప్రాంతంలో విగ్రహాల తయారీకి, అధునాతన ఆలయాల నిర్మాణానికి పేరుగాంచారు. ఎంతటి కఠినమైన దేవుళ్ల విగ్రహాలు మానవుల విగ్రహాలు తయారీలో నైపుణ్యం పొందారు.

ఉమ్మడి ఆంధ్రా రాష్ట్రంలో గుర్తింపు..

ఈ కళాకారులు తెలంగాణలోనే కాక పక్కన గల ఆంధ్రప్రదేశ్‌లో కూడా పేరు పొందారు. ఉభయ రాష్ట్రాల్లో ఏ గ్రామంలో అయినా దేవాలయాలు, దేవుళ్ల శిల్పాలు తయారు చేయాలన్న మొదట సంప్రదించేది ఈ శిల్పులనే. అనేక గ్రామాల్లో వీరు దేవాలయాలపై చెక్కిన శిల్పాలు ప్రాచుర్యం పొందాయి.



ముగ్గు వెంకటాపురంలో నిర్మించిన దేవాలయం

ప్రాణం పోస్తున్న కళాకారులు..

ఆధునిక కంప్యూటర్ యుగంలో అంతరించిపోతున్న ప్రాచీన కళకు ముగ్గు వెంకటాపురం శిల్ప కళాకారులు ప్రాణం పోస్తున్నారు. వీరు తమ ప్రతిభను చాటడమే కాకుండా మరికొంతమందిని తయారు చేస్తున్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీకృష్ణుడు, అభయ ఆంజనేయస్వామి, సీత, రామ, లక్ష్మణులు, ఏసుక్రీస్తు విగ్రహాలతో పాటు పలువురు జాతీయ నాయకుల విగ్రహాలు సైతం తయారు చేస్తున్నారు. గతంలో దేవాలయాల నిర్మాణాలకు ఇతర రాష్ట్రాల నుంచి శిల్పులను తెచ్చి దేవతామూర్తులను చెక్కించేవారు. కానీ ప్రస్తుతం మన ప్రాంతంలోనే ప్రతిభావంతులైన కళాకారులు ఉన్నారు.



ఆలయంపై ప్రతిమలు తీర్చిదిద్దుతున్న కళాకారులు

సబ్సిడీ రుణాలు అందించాలి..



దేవాలయ శిల్ప కళాకారులకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందించి ఆదుకోవాలి. ఇక్కడ కళాకారులు అందరూ పేదవారే. ఉపాధి కోసం ఈ విద్యను నేర్చుకొని జీవితం కొనసాగిస్తున్నాం.

– కల్లేపల్లి భాస్కర్‌రావు, ఆలయ శిల్పి, ముగ్గు వెంకటాపురం

గుర్తింపు కార్డులు ఇవ్వాలి..



దేవాలయ శిల్ప కళాకారులకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రోత్సహించాలి. అదే విధంగా ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయడంతో పాటు రుణాలు మంజూరు చేయాలి.

– మల్లాది కృష్ణ, ఆలయ శిల్పి, ముగ్గు వెంకటాపురం

సొంతింటి కల సాకారమే లక్ష్యం



తల్లాడ: ఇళ్ల మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి, నాయకులు

తల్లాడ/కల్లూరు: పేదోడి సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. శనివారం తల్లాడ ఆర్‌బీ గార్డెన్‌లో 525మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ గృహాల అర్హత మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అదే విధంగా కల్లూరులోని షాదీఖానాలో 300మంది లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇంకా అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కల్లూరు ఆర్డీఓ రాంజేదర్ గౌడ్, మండల ప్రత్యేకాధికారి శివప్రసాద్, హౌసింగ్ డీఈ జగ్రాం, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ సురేష్‌బాబు, హౌసింగ్ ఏఈ షేక్ హస్మా, తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, సత్తుపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, భాగం నీరజ, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

ఏన్కూరు: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శనివారం ఏన్కూరులోని ప్రజా సంఘాల కార్యాలయంలో గుండా సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాంబాబు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బానోత్ బాలాజీ మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి స్థల విస్తీర్ణంలో నిబంధనలు సడలించడంతో పాటు రాజకీయ వివక్ష చూపొద్దన్నారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకలు పెంపకం దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, మహిళా రైతు సంఘం జిల్లా కోకన్వీనర్ సమత, రైతు సంఘం మండల అధ్యక్షుడు వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి లెనిన్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ కాల్వలను రైతు సంఘ నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడుతూ.. కెనాల్‌కు భూములు ఇచ్చిన నిర్వాసితులకు ప్రభుత్వం తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలన్నారు.



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

చర్చి నిర్మాణాలకు ఆర్థిక సాయం



రూ.20వేలు నగదు అందిస్తున్న దాత పూర్ణచంద్రారెడ్డి

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని ఎస్సీకాలనీలో చర్చి నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.25వేలు వితరణ చేశారు. చర్చి నిర్మాణానికి సహకరించాలని మాజీ ఎంపీటీసీ సామనూరి కృష్ణార్జునరావు, చర్చి కమిటీ సభ్యులు ఖమ్మంలో పొంగులేటిని కలిసి కోరగా.. ఆయన నగదు అందించారు. అదే విధంగా బుచ్చిరెడ్డిపాలెంలో చర్చి నిర్మాణానికి భీమవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు యరమల పూర్ణచంద్రారెడ్డి రూ.20వేలు నగదు అందించారు. దీంతో దాత పూర్ణచంద్రారెడ్డిని ఫాదర్ ఆదాం ఎలీషా అభినందించారు. పలువురు సంఘస్తులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విశ్వధర్మ క్షేత్రానికి రూ.3లక్షల వితరణ



దాతకు రశీదు ఇస్తున్న ఆలయ బాధ్యులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం బుగ్గపాడు శ్రీవిశ్వధర్మక్షేత్రంలోని శ్రీఅన్నపూర్ణేశ్వరి అమ్మవారి దేవాలయ శిఖర(శ్రీ చక్రం) నిర్మాణానికి వెదుళ్లపల్లి శివరామకృష్ణ శనివారం రూ.3 లక్షల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

మధిర: రాష్ట్రవ్యాప్తంగా శనివారం విడుదలైన పాలిసెట్ పరీక్షల ఫలితాల్లో మధిర టీవీఎం పాఠశాల విద్యార్థి సాయి గౌతమ్ సత్తా చాటాడు. రాష్ట్రస్థాయిలో బైపీసీ విభాగంలో 44వ ర్యాంక్, ఎంపీసీ విభాగంలో 66వ ర్యాంక్ సాధించాడు. ఇదే పాఠశాల విద్యార్థి మాగం యశ్వంత్ రాష్ట్ర స్థాయిలో 839వ ర్యాంక్ సాధించగా వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ ప్రభాకర్ అభినందించారు.

ఉత్తమ ఫలితాలు..

స్థానిక సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ విద్యార్థి కాజా హరిదీప్ 119/120 మార్కులు సాధించి స్టేట్ 8వ ర్యాంకు సాధించాడు. ఖమ్మం జిల్లాలో, మధిర మండలంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఉత్తమ ఫలితాలు సాధించిన హరిదీప్‌ను పాఠశాల కరస్పాండెంట్ థామస్, ప్రిన్సిపల్ ఆన్ బేబీ అభినందించారు. అదేవిధంగా భరత్ టెక్నో స్కూల్ విద్యార్థి శీలం రాజశేఖర్ రెడ్డి 116 మార్కులతో రాష్ట్రస్థాయిలో 30వ ర్యాంక్ సాధించాడు. టీజీఆర్ జేసీ ఎంట్రన్స్ ఫలితాల్లో నరెడ్ల దేవహర్షారెడ్డి రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంకుతో ప్రతిష్ఠాత్మకమైన సర్వేలు రెసిడెన్షియల్ కళాశాలలో సీటు సాధించాడు. రాజశేఖర్ రెడ్డిని, దేవ హర్షారెడ్డిని భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, డైరెక్టర్ విద్యాలత తదితరులు అభినందించారు.

- **సత్తుపల్లిటౌన్:** పట్టణంలోని టాలెంట్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు పాలిసెట్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి ప్రతిభ చూపారు. చక్రపు సహస్ర ఎంపీసీ విభాగంలో 806వ ర్యాంక్, బైపీసీ అగ్రికల్చర్ విభాగంలో 290వ ర్యాంక్ సాధించింది. షేక్ పర్వీన్ ఎంపీసీలో 815వ ర్యాంక్, బైపీసీ అగ్రికల్చర్‌లో 664వ ర్యాంక్, దండమూడి లక్ష్మీదుర్గా బైపీసీ అగ్రికల్చర్‌లో 400వ ర్యాంక్, ఎంపీటీసీలో 1052వ ర్యాంక్ సాధించారు. వీరిని టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ శంకర్, సురేష్, చెన్నారావు, అభినందించారు.
- **పెనుబల్లి:** పాలిసెట్ ఫలితాల్లో మండలంలోని వీయంబంజర్ అరుణోదయ మెరిట్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని యర్రనూక శ్వేతచంద్ర ప్రతిభ చాటి రాష్ట్రంలో 268 ర్యాంక్ సాధించింది. దీంతో ఆమెను అధ్యాపకులు, గ్రామస్తులు అభినందించారు.

టీడీపీ మండల కమిటీల ఎన్నిక

టీడీపీ మండల అధ్యక్షుడిగా పుల్లారావు..

మధిర: టీడీపీ మధిర మండల అధ్యక్షుడిగా మార్నీడి పుల్లారావు ఎన్నికయ్యారు. మధిరలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఆయనను ఖమ్మం పార్లమెంటరీ పార్టీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మధిర నియోజకవర్గ పరిశీలకులు గుత్తా సీతయ్య అభినందించారు.

మండల అధ్యక్షుడిగా సామేలు..

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండల అధ్యక్షుడిగా దోమందుల సామేలు ఎన్నికయ్యాడు. ఎర్రుపాలెంలోని టీడీపీ కార్యాలయంలో ఆయనతో పాటుగా ఉపాధ్యక్షుడిగా రామారావు, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణతో పాటు మరో ఏడుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో వారిని గుత్తా సీతయ్య, నాయకులు

వైరాలో సురేందర్..

వైరారూరల్: వైరా టీడీపీ మండల అధ్యక్షుడిగా కిలారు సరేందర్‌ను ఎన్నికయ్యారు. వైరాలోని పార్టీ కార్యాలయంలో ఆయనతోపాటుగా ఉపాధ్యక్షుడిగా ఉదయ్‌కుమార్, కార్యదర్శిగా రామకృష్ణతో పాటు మరికొందరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారికి ఖమ్మం పార్లమెంటరీ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం నియామక పత్రాలు అందించి అభినందించారు.

భూ సమస్యలు పరిష్కరించాల్సిందే..

ముదిగొండ: మండలంలోని వల్లాపురంలో 8 కుంటల గ్రామ కంఠభూమి ఆక్రమణకు గురైందని గ్రామస్తులు శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా, ఆందోళన నిర్వహించారు. గ్రామంలో కొందరు రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రభుత్వ భూమి ఆక్రమణలు తొలగించాలంటూ.. గ్రామ జీపీ కార్యాలయం నుంచి కార్యదర్శిని బయటకు రానియ్యకుండా, సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన విరమించేదే లేదన్నారు. సుమారు 3గంటల వరకు ఆందోళన చేపట్టిన తర్వాత ఎంపీఓ వాల్మీకి కిషోర్ ఘటన స్థలానికి చేరుకుని సమస్యను మూడురోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

నిరుపేదలందరికీ పోడు పట్టాలివ్వాలి

కొణిజర్ల: ప్రభుత్వం పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని అఖిల భారత ఐక్య రైతు కూలీ సంఘం తెలంగాణ రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఎల్లన్న నగర్‌లో మేడి కొండలరావు అధ్యక్షతన నిర్వహించిన రైతు సంఘం వైరా సబ్‌డివిజన్ ప్రథమ మహాసభను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం 11మంది సభ్యులతో వైరా డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, లక్ష్మణ్, అప్పారావు, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

ఎర్రుపాలెం: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి మార్కులు సాధించడం అభినందనీయమని ఎంఈఓ బి.మురళీమోహన్‌రావు అన్నారు. శనివారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో జేఎస్ ఆర్ ఫౌండేషన్ నిర్వాహకుడు జంగా గురునాథరెడ్డి పదిలో ప్రతిభ చూపిన 24మంది విద్యార్థులను శాలువాలతో సత్కరించి జ్ఞాపిక అందించారు. ఖైరేర్ ఆస్పత్రి అధినేత నవీన్‌రెడ్డి, పీఆర్‌టీయూ, యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్ రెడ్డి, బాబురావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

వైరారూరల్: వైరా మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. వైరాలో శనివారం జరిగిన మెగా జాబ్ మేళాలో డిప్యూటీ సీఎంను సీపీఎం నాయకులు కలిసి నియోజకవర్గ కేంద్రంలోని సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని కోరడమే కాక ఏన్కూరు మండలంలో సీతారామ ప్రాజెక్టు లింకు కెనాల్‌కు భూములు ఇచ్చిన రైతులకు పరిహారం విడుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ ఏర్పడి ఏడేళ్లు గడుస్తున్నా అనేక సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రహదారులు, డ్రెయినేజీలు, కమ్యూనిటీ హాల్, షాదీఖానా నిర్మాణాలపై దృష్టి సారించాలని కోరగా డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు సుంకర సుధాకర్, పారుపల్లి కృష్ణారావు, కొంగర సుధాకర్, గుడిమెట్ల మోహన్‌రావు, బానోతు రవి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి బాటిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

- వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో లయన్స్ క్లబ్, వైరా గ్రేట్ విజన్ సంయుక్త ఆధ్వర్యాన నిరుద్యోగులు, అధికారులకు తాగునీరు సమకూర్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ 5వేల మందికి నీరు సరఫరా చేయడం అభినందనీయమన్నారు. లయన్స్‌క్లబ్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, రాష్ట్ర హస్త కళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్‌తో పాటు వుంద్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, చింతోజు నాగేశ్వరరావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, తోటకూర శ్రీకాంత్, వుయ్యూరు రామకృష్ణ, అబ్బూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ



చింతకాని: మాట్లాడుతున్న ఎంఈఓ రామారావు

మధిర: మధిర సీపీఎస్ పాఠశాలలో 5రోజులుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ వై.ప్రభాకర్ పరిశీలించి మాట్లాడారు. ఉపాధ్యాయులు పాఠశాలల బలోపేతంపై దృష్టి పెట్టాలని, విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమాలల్లో శిక్షణా తరగతులకు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించిన పిల్లి నరసింహారావు, ఎండీ రఫీ, జమీర్, విశ్వనాథం, మహేంద్ర కుమార్, హసీనా, రాజు లను ఎంఈఓ అభినందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, సుధాకర్, నాగరాజు, సునీత తదితరులు పాల్గొన్నారు.

- **చింతకాని:** మండలంలోని కొదుమూరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ సలాది రామారావు పాల్గొని మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు తోటకూరి శ్రీనివాసరావు, జయకర్, వాసు, కృష్ణారావు, సోందుమియా సాహెబ్, ప్రీతం, ప్రేమ్ కుమార్ నోబెల్, వెంకటేశ్వరరావు, ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.
- **కారేపల్లి:** కారేపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన శిక్షణ తరగతులను ఎంఈఓ దుగ్గిరాల జయరాజు పరిశీలించి మాట్లాడారు. అనంతరం పదో ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపి మండలస్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన మాధారం జేడీఏపీ మైనింగ్ స్కూల్ విద్యార్థి చాగంటి సాయిమన్వితను సన్మానించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు శ్యామ్‌లాల్, లక్ష్మణ్, శ్రీను, రామకోటి, జాకీర్‌బాబా, బాలాజీ, మోహన్, వీరన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలి

మధిర/బోనకల్: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు అన్నారు. శనివారం మధిర సీపీఎస్ పాఠశాలలో జరుగుతున్న శిక్షణా తరగతులను సందర్శించి, బోనకల్‌లోని రావినూతల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు గుగులోత్ రామకృష్ణ, ఉపాధ్యాయులు సుధాకర్, రంగారావు, సద్దాబాబు, వెంకటేశ్వర్లు, రామారావు, నిర్మల, గంగాభవాని, పద్మావతి, యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, సుధాకర్, నాగరాజు, సునీత, చెన్నయ్య, రాజు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు

రూ.3లక్షల కోట్లు కేటాయించాలి



ఏన్కూరు: కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఏన్కూరు/సత్తుపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి రూ.3లక్షల కోట్లు నిధులు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని ఏన్కూరు, రేపల్లెవాడ గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధి పని ప్రదేశాలను సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల అధ్యక్షుడు ఇటికాల లెనిన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అదే విధంగా సత్తుపల్లిలోని బేతుపల్లిలో ఉపాధి కూలీలను వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ కలిసి మాట్లాడారు. వామపక్షాల ఒత్తిడితో యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ ఉపాధిహామీ చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీయం చేస్తుందని, బడ్జెట్‌లో నిధులు తగ్గించి పేదలకు ఉపాధిని దూరం చేయాలని చూస్తుందని ఆరోపించారు. ఉపాధి సమస్యలపై ఈ నెల 30న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుటుంబరావు, నరేష్, రామారావు, వెంకటేశ్వర్లు, బాబు, శ్రీను, లక్ష్మీనారాయణ, సత్యం, నిర్మల, అలివేలు, రాంబాబు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు గిరి ప్రసాద్



సత్తుపల్లిరూరల్: గిరిప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దండు ఆదినారాయణ

మధిర/సత్తుపల్లిరూరల్: నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకూ పోరాడిన నల్లమల గిరిప్రసాద్ కమ్యూనిస్టులకు ఆదర్శప్రాయుడని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, దండు ఆదినారాయణ తెలిపారు. గిరిప్రసాద్ వర్ధంతిని ఆయన స్వగ్రామమైన మధిర మండలం తొండలగోపవరంలో శనివారం నిర్వహించగా, స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని రవిబాబు ఆవిష్కరించారు. సత్తుపల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.ఏ.రహీమ్, ప్రకాశరావు, లక్ష్మణ్, వెంకటేశ్వరరావు, రాము, సత్తుపల్లి పట్టణ కార్యదర్శి రామకృష్ణ, వీరయ్య, ప్రభాకర్, కృష్ణ, రాంబాబు, వీర్రాజు, వెంకట్రావమ్మ పాల్గొన్నారు.

సైనికులకు నివాళి

ముదిగొండ: ముదిగొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తపస్ ఆధ్వర్యంలో భారత సైనికులు ఇటీవల చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌కు ఉపాధ్యాయులు మద్దతుగా జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు ఉపాధ్యాయులు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ రమణయ్య, తపస్ జిల్లా అధ్యక్ష, కోశాధికారులు వెంకటరమణారెడ్డి, రవికిరణ్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్, మండల కార్యదర్శి జహీర్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీతాయారమ్మకు నివాళి..



లక్ష్మీతాయారమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ మట్టా దయానంద్

సత్తుపల్లి: మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివవేణు తల్లి లక్ష్మీతాయారమ్మ దశదిన కర్మ సందర్భంగా సత్తుపల్లి మండలం బేతుపల్లిలో శనివారం ఆమె చిత్రపటానికి కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.